అమెరికా లోని బోస్టన్ నగరపు తెలుగు వాసులు ఈ సంవత్సరం దీపావళి పండుగను 'గ్రేటర్ బోస్టన్ తెలుగు సంఘం' (TAGB) ఆధ్వర్యంలో కనులపండువగా, వీనుల విందుగా పండుగ రోజునే (శనివారం అక్టోబర్ 21) జరుపుకున్నారు. సుమారు 530 మంది తెలుగువారు, పిల్లాపాపలు, అత్యంత ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ప్రముఖ కళాకారుల ప్రదర్శనలను ఆనందించారు. దాదాపు అయిదు గంటలకు పైగా జరిగిన ఈ కార్యక్రమం పెద్దలను, పిల్లలను ఆహ్లాదపరచి సమయం అధిగమించినా ప్రేక్షకుల ఆసక్తి, ఉత్సాహం తగ్గకుండా విజయవంతంగా సాగింది. ప్రారంభంలో బోస్టన్ వాసురాలు కళాకారిణి శ్రీమతి భమిడిపాటి వల్లి గారు గణపతి ప్రార్ధన, తేట తెలుగు జానపద గీతంతో రాబోయే కార్యక్రమం రుచి చూపించారు. సంఘం అధ్యక్షులు శ్రీ కాకి శ్రీనివాస్ గారు ప్రసంగిస్తూ TAGB లో పలు సంస్కరణలు చేపట్టామని, సభ్యులు మరింతగా పాల్గొని తమదైన ఈ సంఘానికి ప్రోత్సాహం అందించాలని కోరారు. సంధాత శ్రీమతి అను మైత్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ, మొదటగా మాజీ మంత్రి , రాజ్యసభ సభ్యులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. డా. ప్రసాద్ గారు దీపావళి పండుగలో మహిళలకి ఉన్న ప్రాధాన్యతని గుర్తు చేస్తూ, తెలుగు సంస్కృతిని, కళలను ప్రవాసాంధ్రులు కాపాడి పోషిస్తున్నారని శ్లాఘించారు.

కార్యక్రమంలోని రెండు ముఖ్యాంశాలలో మొదటిదయిన డా. ఘజల్ శ్రీనివాస్ గారి ఘజల్ సంగీత వల్లరి హాస్యంతో, ఆర్ద్రతతో పసందుగా, హృదయానికి హత్తుకునేలా సాగి శ్రోతలని పరవశం చేసింది. ఏడవ శతాబ్దం నాటి గానప్రక్రియ ఘజల్ ను తేట తెలుగులో శ్రావ్యంగా ఆలపించి ఆంధ్రులని అలరిస్తున్న డా. శ్రీనివాస్ గారు మొదటిసారిగా బోస్టన్ తెలుగువారిని కూడా ముగ్ధులని చేశారు. ప్రతివారి హృదయాలకి దగ్గరయిన తెలుగు పల్లెలు, తల్లి ప్రేమ, పిల్లల ఆటలు లాంటి విషయాల గురించి చక్కని అంత్యప్రాస పద్యాలు కంజీర వాద్యం తో పాడుతూ సున్నితమైన హాస్యాన్ని రంగరించి సభను ఆహ్లాద పరిచారు. డా. తటవర్తి రాజగోపాలం గారు రచించిన మనమందరం పోగొట్టుకున్న బాల్యం గురించిన ఘజల్, డా. రెంటాల వెంకటేశ్వర రావు గారు రచించిన చిన్న పిల్లలు మనకి పంచే ప్రేమ గురించిన ఘజల్, ఇవి కాకుండ మరెన్నో గీతాలు మళ్ళీ మళ్ళీ వినాలనిపించేటట్టు శ్రీనివాస్ గారు ఆలపిస్తుంటే విచ్చేసినవారి హర్షధ్వానాలతో సభ మిన్నుముట్టింది. ముఖ్యంగా దేశాంతరం వెళ్ళిపోయిన కొడుకుగురించి ఒక తల్లిపడే బాధను అక్కడ వున్న ప్రవాసాంధ్రులకు 'ప్రాణానికి సుఖంలేనిదే పైసలుండి ఏముంది ' అని కళ్ళకు కట్టినట్టుగా పాడినప్పుడు బరువెక్కని గుండె సభలో లేదనడం అతిశయోక్తికాదు. ప్రవాసాంధ్రులు తమదేశాన్ని మరిచిపోకూడదని, సంతోషంగా వుంటు ఆ సంతోషాన్ని నలుగురితో పంచుకోవాలని గుర్తుచేస్తూ డా. శ్రీనివాస్ గారు తమ కార్యక్రమం ముగించారు.

తరువాతి అంశం 'మోహినీ భస్మాసుర ' కూచిపూడి నృత్యనాటిక విజయవాడ 'శ్రీ బాలత్రిపురసుందరి నాట్య కళాక్షేత్రం ' అధిపతి డా. పసుమర్తి వేంకటేశ్వర శర్మ గారి నేతృత్వంలో అత్యంత విలక్షణంగా సాగింది. పద్మశ్రీ డా. వెంపటి చిన సత్యం గారి ప్రధాన శిష్యులైన డా. శర్మ గారు వారి గురువులు, కూచిపూడి పరంపర కూడా గర్వించే విధంగా 'మోహిని భస్మాసుర ' కాకుండా అనేక కూచిపూడి నృత్యనాటికలకు కూర్పు చేసారు. ఏడు భాగాలుగా జరిగిన ఈ నృత్యనాటికలో కళాకారుల ఆకర్షణీయమైన దుస్తులు, వేషధారణ దగ్గరనుంచి, తెరవెనుక గీతాలలోని వినూత్నశైలి వరకు ప్రతి అంశం ప్రేక్షకులని ఆకట్టుకుంది. విశేషంగా భస్మాసుర పాత్రలో డా. శర్మ గారు ప్రతీ భాగంలో ముఖ్యపాత్ర వహించి వారి పద విన్యాసంతో, హావభావాలతో నృత్యాన్ని రక్తి కట్టించారు. పరమశివుణ్ణి భస్మాసురుడు భస్మం చేయాలని ప్రయత్నించే అంశం, మోహిని నాట్యాన్ని భస్మాసురుడు అనుకరించే అంశాలలో ప్రతి విన్యాసం ప్రజల మనసులలో హత్తుకుపోయేటట్టు కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలోని కళాకారులందరూ, ముఖ్యంగా డా. శర్మ గారు చేసిన కృషి, వారి ప్రతిభా పాటవాలు తెలుగువారందరికీ గర్వకారణం.

ఈ కార్యక్రమంలో శ్రీ సత్యనారయణ గారు, శ్రీ కొంపెల్ల సుబ్బారావు గారు, Dr. ములుకుట్ల శర్మ గారు, Dr. శివపురపు నాగేశ్వరరావు గారు, శ్రీ శాంతారాం గారు, శ్రీమతి శైలజా ప్రకాష్ గారు , శ్రీ ధుళిపాల రావు గారు కళాకారులకు, అతిధులకు జ్ఞాపికలు బహూకరించారు.

TAGB కార్యక్రమం విజయవంతంగా జరగడానికి ఆర్ధికంగా సహాయంచేసిన దాతలు శ్రీయుతులు నన్నపనేని మోహన్, ప్రకాష్ రెడ్డి, డా. అమ్మణ్ణి, రంజన్ వడ్లపట్ల గార్లకు, న్యూ ఇంగ్లాండ్ తెలుగు సంఘానికి, స్పెషల్ టిక్కట్లు కొనుక్కున్న సభ్యులకు, స్వచ్ఛంద కార్యకర్తలకు TAGB కార్యవర్గం తరపున ఉపాధ్యక్షులు Dr. జయంతి సూర్య గారు ధన్యవాదాలు చెప్పడంతో కార్యక్రమం ముగిసింది.